క్లుప్తంగా

పథకాల పోస్టర్లను ప్రదర్శించాలి



కొడవలూరు: సచివాలయాల్లో సంక్షేమ పథకాల పోస్టర్లను విధిగా ప్రదర్శించాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని రామన్నపాళెం, ఆలూరుపాడు సచివాలయాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పోస్టర్లను సచివాలయాల గోడలకు తప్పక అంటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించి ఉన్నారని గుర్తుచేశారు. అదేలా లబ్ధిదారుల తాజా జాబితాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. సంక్షేమ క్యాలెండర్ తప్పక ఉండాలన్నారు. సిబ్బంది ఏమైనా కార్యాలయ పనులపై వెళ్తే విధిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ సునీల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మినీ స్ప్రింక్లర్ల పరిశీలన



కోవూరు(విడవలూరు) : మండలంలోని ముదివర్తి గ్రామంలో రైతులకు రాయితీపై అందజేసిన మినీ స్ప్రింక్లర్లను బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ జి.విద్యాధరి పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ స్ప్రింక్లర్ల పనితీరు, వాటిని రైతులు వాడుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఐదెకరాల్లోపు రైతులకు 90 శాతం సబ్సిడీ, పదెకరాల్లోపు రైతులకు 70 శాతం సబ్సిడీ ద్వారా మినీ స్ప్రింక్లర్లను పొందామని రైతులు వివరించారు. వీటి ద్వారా నీటిని ఆదా చేయడంతో పాటు ఖర్చు కూడా తక్కువని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఆమె వెంట పలుశాఖల అధికారులు బి.శ్రీనివాసులు, ఒ.సుబ్బారెడ్డి, బాలాజీరెడ్డి, నరేష్, హరి తదితరులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కనుపూరు వద్ద బుధవారం జరిగింది. బుజుబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన జాకీర్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా కనుపూరు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో జాకీర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన హరికథ



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా చిన్నారులు చేస్తున్న సాంప్రదాయ నృత్యాలు, రంగస్థల నాటికలు ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రావెళ్ల భారతి అనే మహిళ చేసిన శ్రీకృష్ణ రాయభారం అనే హరికథ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆమెను దేవస్థాన పాలకమండలి సభ్యులు పద్మ, కామేశ్వరమ్మ అభినందించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అమ్మవారి విద్యుత్ కటౌట్లు ఆకట్టుకున్నాయి.

రాగి తీగలే లక్ష్యంగా చోరీలు

మనుబోలు : మనుబోలు పరిధిలో విద్యుత్ మోటార్లలోని రాగితీగలే లక్ష్యంగా దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. గత కొన్నిరోజులుగా ఇలాంటి ఘటనలు ఆగడం లేదు. పొలాల వద్ద సాగునీటి సదుపాయం కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను పదేపదే దొంగలు అపహరిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మనుబోలుకు చెందిన కలికి సుధీర్‌రెడ్డి బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో తన పొలంలో ఏర్పాటు చేసుకున్న రూ.30 వేల విలువ చేసే 5 హెచ్‌పీ విద్యుత్ మోటార్లలో రాగితీగలను చోరీ చేసినట్లు బాధిత రైతు బుధవారం తెలిపాడు. ఇటీవల ఓ మోటార్‌ను దొంగిలిస్తే కొత్తది అమర్చామని, దానిని కూడా అపహరించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే వెంకయ్యస్వామి ఆలయం వద్ద ఉన్న పంచాయతీ మినీ వాటర్ స్కీమ్‌కు చెందిన రెండు మోటార్లను కూడా మంగళవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. కరెంటు మోటార్ల దొంగలపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను రైతులు కోరుతున్నారు. చోరీ ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

• కమిషనర్ వికాస్ మర్మత్



పారిశుధ్యంపై చర్చిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు చేపడతామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరంలోని 37వ డివిజన్లో గల క్రాంతినగర్, మాగుంట లేఅవుట్ దక్షిణం, మిలటరీ కాలనీ, కొండాయపాళెంలోని శానిటేషన్ మస్టర్ పాయింట్లను బుధవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. హోటళ్లు, వాణిజ్య కార్యాలయ నిర్వాహకులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా తమ ప్రాంతానికి వచ్చిన వాహనాలకు మాత్రమే అందజేయాలని కోరారు. పరిశుభ్రతపై కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వీరిని గుర్తించి నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. ఓ హోటల్ నిర్వాహకులు రోడ్డుపై ఎంగిలి ఆకులు, ఇతర వ్యర్థాలు వేయడాన్ని గుర్తించిన కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే వ్యర్థాలను తిరిగి హోటల్లో వేయించడంతో పాటు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన సిబ్బందికి నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. మినరల్ వాటర్ కేంద్రాల్లో పాటించే నాణ్యత ప్రమాణాలు, విక్రయిస్తున్న ధర, తదితరాలపై నీటిని సరఫరా చేస్తున్న వాహన నిర్వాహకుడితో మాట్లాడారు. కార్పొరేటర్ శ్రీనివాసయాదవ్, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విరివిగా జాబ్‌మేళాలు



ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాకు హాజరైన వారు (ఫైల్)

నెల్లూరు(మినీబైపాస్): నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయం నిరుద్యోగుల పాలిట వరంలా నిలుస్తోంది. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఇక్కడ దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ లేదా ప్రైవేట్ కార్యాలయాల్లో ఏదైనా ఉద్యోగం ఉంటే మొదట ఉపాధి కార్యాలయానికే సమాచారం అందుతుంది. అయితే చాలాకాలంగా ఇది ఉందో లేదోననే విషయం అనేక మందికి తెలియదు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారి సంఖ్య కూడా స్వల్పంగా ఉండేది. ప్రస్తుతం ఇక్కడ జాబ్‌మేళాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వీరికి అవసరమైన ట్రైనింగ్, కౌన్సెలింగ్ అందిస్తున్నారు. ఈ ఏడాది మే 15 నాటికి 11 జాబ్‌మేళాలను నిర్వహించారు. 37 కంపెనీలు వివిధ ఖాళీల భర్తీ కోసం నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేసి 216 మందికి ఉద్యోగాలు కల్పించాయి.

ఉద్యోగాల కల్పన ఇలా..

నెల	జాబ్‌మేళాలు	కంపెనీలు	ఉద్యోగం పొందిన వారు
జనవరి	4	12	24
ఫిబ్రవరి	1	10	50
మార్చి	3	6	37
ఏప్రిల్	2	5	88
మే	1	4	17

ఉద్యోగాలు కల్పిస్తున్నాం



నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేలా చర్యలు చేపట్టాం. ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి, కావాల్సిన నైపుణ్యాలు, తదితరాపై జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నాం. జాబ్‌మేళాల ద్వారా ఇప్పటికే చాలా మంది ఉద్యోగాలు పొందారు.

– సురేష్‌కుమార్, జిల్లా ఉపాధి అధికారి

బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉచిత బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడారు. సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ద్వారా షటిల్ బ్యారెల్స్‌ను కోచ్ వెంకటేష్‌కు ఆయన అందజేశారు. కావలిలో నిర్వహిస్తున్న శిబిరాన్ని త్వరలో సందర్శించి వారికి సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీర వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకటశ్రీకాంత్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించండి



మనుబోలు : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆర్డీఓ మలోల సిబ్బందికి సూచించారు. మనుబోలులోని సచివాలయం-2ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు డాక్యుమెంట్లు, రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. అర్జీదారులకు సచివాలయాల పనితీరుపై నమ్మకం కలిగేలా చూసుకోవాలన్నారు. సమయపాలన తప్పక పాటించాలన్నారు. స్పందనలో అర్జీల రూపంలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రోజుల తరబడి అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. అనంతరం అనుపల్లిపాడు గ్రామంలో రీసర్వేలో భాగంగా రాళ్ల నాటే పనులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రీ సర్వే పనులను వేగవంతం చేయాలి

పొదలకూరు : గ్రామాల్లో భూముల రీసర్వే పనులను వేగవంతం చేయాలని నెల్లూరు ఆర్డీఓ ఎ.మలోల పేర్కొన్నారు. మండలంలోని మొగళ్లూరు గ్రామంలో భూముల హద్దులకు సంబంధించి సర్వే రాళ్ల నాటుతుండగా ఆర్డీఓ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాళ్ల నాటే పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయానికి చేరుకుని రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్, సర్వేయర్ ఎల్.వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలి



కొడవలూరు : ఉపాధి పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని డ్వామా ఏపీడీ మృదుల సూచించారు. స్థానిక డ్వామా కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగినన్ని లభ్యమవుతున్నందున వాటిని ఉపాధి కూలీల నిమిత్తం తీసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. పనుల సమయంలో ఎవరైనా కూలీలు నీరసిస్తే వెంటనే ఓఆర్ఎస్ తాగించి పీహెచ్‌సీలకు పంపాలని చెప్పారు. కూలీలు పనిచేసే చోట నీడ కోసం విధిగా పట్టలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధి కూలీలంతా ఉదయం 6 గంటలకే పనికి వచ్చి 10 గంటలకు పని ముగించుకునేలా చూడడంతోపాటు వారి వెంట మూడు లీటర్ల మంచి నీటిని తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎండ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉదయం 10 గంటలపైన ఎట్టి పరిస్థితుల్లో పనులు చేయించరాదని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ రాజశేఖర్, టీఏ రియాజ్, ఎఫ్ఏ కొప్పు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల ఆనందోత్సాహం

ముత్తుకూరు : దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా చేపలవేట నిషేధ సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.10,000లు పంపిణీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని మత్స్యకార నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు యల్లంగారి వెంకటేశ్వర్లు, నేతలు సాయి తదితరులు మాట్లాడుతూ, మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో చిన్న, సుబ్బు, మల్లి, చిట్టి, శివ పాల్గొన్నారు.

కనీస వేతనంగా రూ.20 వేలివ్వాలి



మాట్లాడుతున్న చింతా మోహన్

నెల్లూరు(మినీబైపాస్): ముత్తుకూరు, శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లలో పనిచేసే కార్మికులు, తదితరులకు కనీస వేతనంగా రూ.20 వేలను ఇవ్వాలని మాజీ ఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో వేతనాలను పెంచాలన్నారు.

తప్పుడు వార్తలు సృష్టించే వారిపై చర్యలకు వినతి



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేరుతో తప్పుడు వార్తలు సృష్టించిన వారిపై చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగ నేతలు కోరారు. ఈ మేరకు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి వినతిపత్రాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం అందజేసిన అనంతరం విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. వే 2 న్యూస్ నకిలీ లోగోను రూపొందించి ఎమ్మెల్యే పేరుతో తప్పుడు వార్తను సృష్టించి ప్రచారం చేశారని ఆరోపించారు. దీనికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. కొందరు అనుమానితుల పేర్లను సైతం అందజేశారు. కాగా విచారణ జరిపి నిందితులపై చర్యలు చేపడతామని ఎస్పీ హామీ ఇచ్చారు. యువజన విభాగ అధ్యక్షుడు జయకృష్ణారెడ్డి, నేతలు సాకేష్‌రెడ్డి, విద్యార్థి విభాగ నేతలు ఆనంద్, ఫరూక్, తౌఫిక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల అఫిలియేషన్ కమిటీ సమావేశం

నెల్లూరు (దర్గామిట్ట): ప్రైవేట్ జూనియర్ కళాశాలల అఫిలియేషన్‌కు సంబంధించిన సమన్వయ సమావేశాన్ని కలెక్టరేట్లోని తన చాంబర్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల అఫిలియేషన్‌కు సంబంధించి ఎస్పీ, డీపీఓ, అగ్నిమాపక శాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ప్రత్యేక సమీక్షను జరిపారు. జిల్లాలోని 72 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఉదయం తొమ్మిది నుంచి 12 వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలను మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించనున్నారన్నారు.

ప్రజా సహకారంతోనే అభివృద్ధి



నెల్లూరు(బారకాసు): ప్రజా సహకారంతోనే డివిజన్ల అభివృద్ధి సాధ్యమని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. 28వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను కార్పొరేటర్ అహల్యతో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం మేయర్ మాట్లాడారు. శాంతినగర్‌లోని వీధులు, కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలో సిమెంట్ రోడ్డును నిర్మించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయొద్దని కోరారు.

ఏబీవీపీ నేతల ధర్నా



నెల్లూరు (టౌన్): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు గాంధీబొమ్మ సెంటర్‌లో బుధవారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని కోరారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కన్వీనర్ అశోక్, నేతలు యశ్వంత్, రాహుల్, చందు, బాలాజీ, నరసింహ, వినోద్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

షాదీమంజిల్ నిర్మాణాన్ని పూర్తి చేయరూ..



సీపీఐ, ఏఐవైఎఫ్ నేతల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో నిర్మిస్తున్న షాదీమంజిల్‌ను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిరాజ్ కోరారు. జనార్దన్‌రెడ్డికాలనీలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. షాదీమంజిల్ నిర్మాణ పనులను చేపట్టి నాలుగేళ్లు కావస్తున్నా, ఇంకా పూర్తి కాలేదని చెప్పారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షానవాజ్, నేతలు అహ్మద్, గౌస్, మధు, సర్దార్, బాదుల్లా, కరిముల్లా, సుల్తాన్, మునాఫ్, అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై సంతపేట పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని సాయినగర్‌కు చెందిన అనిల్‌కుమార్ కేవీసీ ప్లాజాలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో గుమాస్తాగా పని చేస్తున్నారు. తన ప్యాషన్ ప్రో బైక్‌ను ప్లాజా వద్ద ఈ నెల 12న నిలిపి లోపలికెళ్లారు. తిరిగొచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అన్ని కేడర్లకూ బదిలీలు వర్తింపజేయాలి

నెల్లూరు(అర్బన్): పరస్పర అంగీకార బదిలీలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో కొన్ని కేడర్ల ఉద్యోగులకే కాకుండా అందరికీ వర్తింపజేయాలని హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రావు, కమల్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. స్టాఫ్, హెడ్ నర్సు, పారామెడికల్ స్టాఫ్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, తదితర 11 కేడర్లలోనే బదిలీలకు అవకాశం కల్పిస్తే అనుకున్న ప్రయోజనాలు రావన్నారు. జీఓ నంబర్ 371ను సవరించి జీఓ 71 మార్గదర్శకాలను అనుసంధానించి బదిలీలు చేయడం ద్వారా అందరికీ న్యాయం చేయాలని కోరారు.

పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు(బృందావనం): వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి కోరారు. కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 మంది వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని బుధవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు నిర్మల్‌కుమార్, జయప్రకాష్, క్రాంతికుమార్, శివ, నాగరాజు, సురేంద్రబాబు, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సమావేశం

నెల్లూరు(మినీబైపాస్): ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గ తొలి సమావేశాన్ని ప్రెస్‌క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి జర్నలిస్టుల సమస్యలకు సంబంధించిన కార్యాచరణను రూపొందించారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్, వారి పిల్లలకు సంబంధించిన రాయితీ విద్య, ఇళ్ల స్థలాలు, తదితరాలపై చర్చించారు. రాష్ట్ర కార్యదర్శి జయప్రకాశ్, గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ప్రేమ పేరిట బాలికను వేధించడమే కాకుండా ఆమెను చంపుతామని బెదిరించిన నిందితుడిపై సంతపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కామాక్షినగర్‌లో నివాసం ఉంటున్న ఓ బాలికను అదే ప్రాంతానికి చెందిన ప్రదీప్ తేజ ప్రేమిస్తున్నానంటూ వెంటపడి కొంతకాలంగా వేధించసాగారు. ఆమె కనిపిస్తే అసభ్యంగా ప్రవర్తించేవారు. ఈ విషయమై బాలిక తన తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో వారు యువకుడి తల్లికి విషయాన్ని తెలియజేశారు. దీంతో ఆగ్రహానికి గురైన ప్రదీప్ తేజ బాలిక ఇంటి వద్దకు ఈ నెల 15న వెళ్లి కత్తితో నానా రభస చేశారు. కనిపిస్తే చంపేస్తానని బాలికను బెదిరించారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు బాలిక కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఎస్సై వేణుగోపాల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కత్తితో చంపుతామని యువకుడ్ని బెదిరించి అతని వద్ద నగదు, సెల్‌ఫోన్‌ను దోచుకెళ్లిన ఘటనలో ఇద్దరు నిందితులను చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. విజయమహల్ గేట్ నుంచి ఏసీ కూరగాయల మార్కెట్‌కు నగరానికి చెందిన ఉమర్ ఫరూక్, మొఘల్ ఉమర్ ఫరూక్ బైక్‌పై ఈ నెల 14వ తేదీ రాత్రి బయల్దేరారు. రాఘవేంద్ర స్కాన్ సెంటర్ వద్దకు వచ్చేసరికి బైక్‌ను ఆపాలని స్నేహితుడికి ఉమర్ ఫరూక్ సూచించారు. బైక్ దిగి మూత్ర విసర్జన చేస్తుండగా, ఇస్లాంపేటకు చెందిన ఇర్ఫాన్ అలియాస్ గోరూ, వెంకటేశ్వరపురానికి చెందిన సాయికిరణ్‌రెడ్డి కత్తితో చంపుతామని బెదిరించి సెల్‌ఫోన్, రూ 250ను దోచుకున్నారు. అడ్డుకోబోయిన మొఘల్ ఉమర్ ఫరూక్‌ను సైతం చంపుతామని బెదిరించారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు వైఎమ్సీఏ గ్రౌండ్స్ వద్ద నిందితులను మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. వీరి నుంచి నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో బుధవారం హాజరుపర్చారు.



బహిరంగ వేలం
తేది: 18.05.2023 (గురువారం)

Veh. No.	Vehicle Description	Year
AP27TX-9819	AL 2518T IL FBT-T	2016

శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్.,